క్లుప్తంగా

'జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష'పై సమీక్ష



జగనన్న శాశ్వత భూ హక్కు - భూరక్ష పై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకంపై సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, రీ సర్వే స్పెషలాఫీసర్ సుబ్బారావు, ఐఏఎస్ ఆఫీసర్ ప్రభాకర్, మున్సిపల్ ఆర్‌డీ మూర్తి, సీపీఓ సువర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష విధి విధానాలను వివరించారు. పక్కాగా రీ సర్వే నిర్వహించాలని సిబ్బంది ఆదేశించారు.

నెట్టికంటి ఆలయ సమస్యలు పరిష్కరించండి

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం ఆలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈఓ గురుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సమితి సభ్యులు ఈఓతో మాట్లాడుతూ భక్తులకు సరైన సౌకర్యాలు లేవని, ఆలయంలో పనివిధానం సక్రమంగా లేదని, పాలక మండలి సభ్యుల సూచనలను అధికారులు సరిగా పట్టించుకోవడం లేదన్నారు.

ప్రజలకు సురక్షిత నీరు అందించడమే ధ్యేయం



రిజర్వాయర్‌లో నీటి నిల్వలు, సరఫరా గురించి వివరిస్తున్న ఎంఈ గురప్ప

గుంతకల్లుటౌన్: పట్టణ ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించడమే ధ్యేయంగా పని చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవానీ, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్‌లు తెలిపారు. మంగళవారం పట్టణంలో జల్ దీవాళి(నీటి దీపావళి) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్‌పీలతో కలిసి రిజర్వాయర్ల సందర్శనకు వెళ్లారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ నీఈ గురప్పయాదవ్ హంద్రీనీవా కెనాల్ నుంచి రిజర్వాయర్లలోకి నీటి పంపింగ్, ఫిల్టర్ బెడ్స్‌లో నీటి శుద్ధి, నీటి పరీక్ష(ఆర్‌సీ టెస్ట్) నీటి సరఫరా ఎలా చేస్తారో వివరించారు. అనంతరం మెప్మా ఆర్‌పీలకు బ్యాగులను అందజేశారు. అసిస్టెంట్ కమిషనర్ కెఎస్.లావణ్య, మెప్మా టీపీఆర్‌ఓ మోహన్, సీఎంఎం.భవాని, సీఓలు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి



జిమ్నాస్టిక్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

గార్లదిన్నె: విద్యార్థులు క్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని కల్లూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం శారదాభాయి పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఈనెల 1న కాకినాడలో జిమ్నాస్టిక్ రాష్ట్ర స్థాయి పోటీల్లో నలుగురు విద్యార్థులు పిరదౌసి, విష్ణు, సాయిహర్షిత్, నందిని అండర్- 14, అండర్-17 విభాగంలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హెచ్ఎంతోపాటు పీడీలు రామప్రసాద్, నారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ప్రిన్సిపాల్ సస్పెన్షన్



సంజిత్ నాయక్

గుత్తి: సహోద్యోగులు, విద్యార్థులను వేధిస్తున్నారనే ఆరోపణలతో గుత్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంజిత్ నాయక్‌పై అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రిన్సిపాల్ తీరుపై కొన్ని రోజులుగా అధ్యాపకులు, విద్యార్థులు ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే. ఇదే అంశాన్ని స్థానిక ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి దృష్టికి అధ్యాపకులు తీసుకెళ్లారు. దీంతో గుత్తి మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, ఎంపీపీ విశాలాక్షి, గుంతకల్లు మున్సిపల్ మున్సిపల్ వైస్ చైర్మన్ నైరుతీరెడ్డి, మహిళా కమిషన్ రాష్ట్ర సభ్యురాలు రుకియాబేగం ఇటీవల కళాశాలను సందర్శించి అధ్యాపకులు, విద్యార్థులు, ప్రిన్సిపాల్‌తో చర్చించారు. ఈ చర్చలూ విఫలమయ్యాయి. దీంతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి విచారణకు ఆర్జేడీ రవినాయక్ ఆదేశించారు. కమిటీ నివేదిక ఆధారంగా ప్రిన్సిపాల్ సంజిత్‌నాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అశ్వత్థానికి మహర్దశ



పూర్తయిన సిమెంటు రోడ్డు

- క్షేత్రాభివృద్ధికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిచొరవ
- రూ.86 లక్షలతో అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే నిధులతో జరుగుతున్న కల్యాణమండపం పనులు



శివాలయంలో నిర్మాణంలో ఉన్న నీడ మండపం

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థం క్షేత్రానికి మహర్దశ పట్టింది. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవతో క్షేత్రంలో దాదాపు రూ.86 లక్షలతో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. వివరాలు..ఇప్పటివరకు కల్యాణమండపం లేక వివాహాలు జరుపుకునే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి ఇటీవల ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే తన నిధుల నుంచి రూ.32 లక్షలు మంజూరు చేశారు. నెల రోజుల క్రితం కల్యాణమండపం పనులు ప్రారంభించారు. ప్రస్తుతం దాదాపు 80 శాతం పనులు పూర్తయ్యాయి. నారాయణ స్వామి, భీమలింగేశ్వర స్వాముల చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేసేందుకు వీలుగా ఉపాధి హామీ నిధులు రూ.10లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మించారు. తిరునాల సమయంలో భక్తులు ఇబ్బందిపడకుండా దాతల సహకారంతో రూ.10 లక్షలతో నీడ వసతి ఏర్పాటు చేస్తున్నారు.

ముమ్మరంగా కాజ్ వే మరమ్మతు పనులు

గతేడాది భారీ వర్షాలకు క్షేత్రం వద్ద పెన్నానదిపై ఉన్న కాజ్‌వే దెబ్బతినింది. దీంతో భక్తుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడి కాజ్ వే మరమ్మతుకు రూ.34 లక్షలు మంజూరు చేయించారు. ప్రస్తుతం కాజ్ వే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మాఘమాసం ప్రారంభానికి మునుపే క్షేత్రంలోని అన్ని అభివృద్ధి పనులన్నీ పూర్తి అవుతాయని ఆలయ చైర్మన్ చెబుతున్నారు.

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌పై దాడి

తాడిపత్రి టౌన్: వైఎస్సార్‌సీపీ పట్టణ సోషల్ మీడియా కన్వీనర్ తలారి సుధాకర్‌పై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి తెగబడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... వ్యక్తిగత పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా టీటీడీ కల్యాణమంటపం సమీపంలోకి చేరుకోగానే ఇద్దరు దుండగులు బీరు సీసాలతో దాడి చేశారు. ముఖానికి ముసుగులు ధరించడంతో దాడికి పాల్పడిన వారు ఎవరైంది ఆనవాళ్లు చిక్కలేదు. ఘటనలో సుధాకర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

తాడిపత్రి అర్బన్: సైబర్ మోసాలపై ప్రతి ఒక్క విద్యార్థి అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సీఐ పి.హమీద్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు సైబర్ మోసాలు, దిశా యాప్స్, పోక్సో కేసులు, మహిళలపై నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ల కొత్త నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదన్నారు. జాబ్స్, లోన్స్, లాటరీ తదితర అంశాలతో ముడిపడి ఫోన్‌లోకి వచ్చే వెబ్ లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అపరిచిత వ్యక్తులతో మాట్లాడొద్దని, డ్రగ్స్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి: పట్టణంలోని కమేళా వీధిలో నివాసముండే ప్రైవేట్ బస్సు డ్రైవర్ హుస్సేన్ బాషా మంగళవారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతన్ని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. కుటుంబ కలహాలతోనే హుస్సేన్ బాషా ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పెద్దవడుగూరు : మండలంలోని రావులుడికి, భీమునిపల్లి, మేడిమాకులపల్లి, తెలికి, చింతలచెరువు, కోనాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి బుధవారం పర్యటించనున్నారు. ఈమేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎద్దుల శరబారెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

అండర్-17 బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థి ఎంపిక

గుంతకల్లుటౌన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో విశాఖలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-17 బ్యాడ్మింటన్ పోటీలకు మాంటిస్సోరి స్కూల్‌కు చెందిన విద్యార్థి వై.జగన్మోహన్ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ కె.నాగార్జున మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్, ఉపాధ్యాయులు జగన్మోహన్‌ను అభినందించారు.

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం

పామిడి: స్థానిక భవితా కేంద్రంలో ఆయుష్, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఆయుర్వేద దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ కృష్ణవేణి ఆయుర్వేద వైద్య విధానంపై అవగాహన కల్పించారు. యోగాతో చేకూరే ప్రయోజనాలను యోగా శిక్షకురాలు సంధ్య వివరించారు. అనంతరం రోగులకు పరీక్ష చేసి మందులను పంపిణీ చేశారు.

ఘనంగా సర్ సీవీ రామన్ జయంతి

గుంతకల్లు రూరల్: సీవీ రామన్ జయంతి వేడుకలను మంగళవారం పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. విజ్ఞాన శాస్త్రంలో దిట్ట అయిన సీవీ రామన్‌ను భారత ప్రభుత్వం భారతరత్నతో పాటు నోబెల్ పురస్కారంతోనూ గౌరవించిందని కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఈఓ రాముడు, ప్రధాన కార్యదర్శి జీఎంవీ చలపతి, సభ్యులు పాల్గొన్నారు.

గుత్తి: శ్రీసాయి జూనియర్ కాలేజీలో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో సీవీ రామన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జయరంగారెడ్డి, ప్రిన్సిపాల్ కాంతారెడ్డి, జేవీవీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామాంజనేయులు, వెంకటరామిరెడ్డి సీవీ రామన్ సేవలను కొనియాడారు.

నేడు నార్పలలో 'జగనన్నకు చెబుదాం'

అనంతపురం అర్బన్: జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమం బుధవారం నార్పలలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం', 'స్పందన- ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. మండల ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

జిల్లా అభివృద్ధి కోసం పోరాడదాం



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబులు

గుంతకల్లుటౌన్: జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై కలిసికట్టుగా పోరాడుదామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు జి.ఓబులు పేర్కొన్నారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు సర్కిల్ వద్ద పార్టీ పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు అధ్యక్షతన బహిరంగసభ నిర్వహించారు. ఓబులు మాట్లాడుతూ కరువు మండలాల్లో ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి ఉపాధి పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని చెరువులకు హంద్రీనీవా ద్వారా నీరందించేందుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధిపై ఈ నెల 15న నిర్వహించే చలో విజయవాడను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు డి.శ్రీనివాసులు, బాలరంగయ్య, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, నిర్మలమ్మ, దాసరి శీనా, మారుతి, రమేష్ పాల్గొన్నారు.

మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజల సమస్యలను అధికారులకు వివరిస్తున్న గ్రామస్తుడు ధనంజయ

యాడికి: చందన గ్రామ సమీపంలో వెంకటేశ్వర మినరల్స్ కంపెనీ 16.727 హెక్టార్లలో చేపట్టనున్న మైనింగ్‌పై ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం పర్యావరణ మండలి అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈసందర్భంగా గ్రామస్తులు మైనింగ్‌తో జరిగే ఇబ్బందులను అధికారుల దృష్టికి తెచ్చారు. మైనింగ్ ఏర్పాటు చేసిన అనంతరం గ్రామాభివృద్ధికి సహకరించాలని మరికొంతమంది కోరారు. ఎటువంటి ఇబ్బంది కలగకుండా గ్రామాభివృద్ధికి సహకరిస్తామని మైనింగ్ అధికారులు హామీ ఇచ్చారు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి, తహసీల్దార్ బాలమ్మ, కాలుష్య నియంత్రణ మండలి అధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రాగుల పార్వతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన జగనన్నతోనే సాధ్యం



17వ వార్డులో పర్యటిస్తున్న సీపీ భవాని, వీసీలు నైరుతి, మైమూన్

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలో పేదరికం పూర్తిస్థాయిలో నిర్మూలన జరగాలంటే మళ్లీ జగనన్నే రావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్ పేర్కొన్నారు. మంగళవారం 17వ వార్డులో కౌన్సిలర్ కెవి.నాగరత్న ఆధ్వర్యంలో వారు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలపై ఆరాతీసి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల ముంగిట్లోకి ప్రభుత్వ సేవలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్నదేనన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. గుంతకల్లు నియోజకవర్గంలో గడిచిన నాలుగున్నరేళ్లలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం సుమారు రూ.2,700 కోట్లు వెచ్చించిందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, పార్టీ యువనేత సిబి.మంజునాథరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ కెవి.వాసు, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

చురుగ్గా అండర్ డ్రైనేజీ మరమ్మతు పనులు



అండర్ డ్రైనేజీ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని 2వ వార్డులోని జామియా మసీదు పక్కన అండర్ డ్రైనేజీ మరమ్మత్తు పనులు చురుగ్గా సాగుతున్నాయి. మంగళవారం 2వ వార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్ బాషా పనులను పర్యవేక్షించారు. రెండు నెలలుగా 2వ వార్డుల్లో అండర్ డ్రైనేజీ మురుగునీరు మ్యాన్‌హోల్స్ నుంచి లీకై జామీయా మసీదు సమీపంలోని పల్లపు ప్రాంతంలో చేరింది. ఈవిషయమై పలుమార్లు కౌన్సిలర్ ఫయాజ్‌బాషాతో ప్రజలు కూడా మున్సిపల్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అయితే మున్సిపల్ అధికారులు స్పందించి మరమ్మతు పనులకు పూనుకుంటే చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డితో పాటు అనుచరులు అడ్డుతగిలేవారు. రెండు రోజుల క్రితం అండర్ డ్రైనేజీలోని మురుగునీరు బాత్‌రూంలలోకి వస్తుండడంతో ప్రజలు కౌన్సిలర్ ఫయాజ్‌బాషా దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఫయాజ్‌బాషా సోమవారం మరమ్మతు పనులకు సిద్ధమయ్యారు. అయితే చైర్మన్ జేసీతన అనుచరులతో వచ్చి అడ్డుకోవడం తెలిసిందే. మంగళవారం పనుల పరిశీలించిన ఫయాజ్‌బాషా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

డ్రైవర్‌కు గాయాలు

యాడికి: రాయలచెరువులో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాలు.. రాయలచెరువు నుంచి వేములపాడుకు వెళ్తున్న బొలెరో క్యాంపర్ వాహనాన్ని తాడిపత్రి నుంచి వస్తున్న లారీని ఢీకొంది. క్యాంపర్ డ్రైవర్ ఖలీల్ వాహనంలోనే ఇరుక్కుపోయాడు. ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్‌ను బయటకు తీయించి తాడిపత్రికి తరలించారు. లారీ డ్రైవర్ సామూ పటేల్ ఫిర్యాదు మేరకు కాంపర్ డ్రైవర్ ఖలీల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు గ్రామ సచివాలయం ప్రారంభం

పుట్లూరు: మండలంలోని అరకటివేముల గ్రామంలో గ్రామ సచివాలయ భవనాన్ని బుధవారం ఉదయం 11 గంటలకుఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రారంభిస్తారని ఎంపీపీ రాఘవరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

కేబుల్ చోరీ

పుట్లూరు: కడవకల్లు గ్రామంలో పలువురు రైతులకు చెందిన విద్యుత్ కేబుల్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాధితులు మంగళవారం ఎస్ఐ దిలీప్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. రూ.12 వేలు నష్టం వాటిల్లిందని వారు వాపోయారు.

నిబంధనలు పాటించాలి

పామిడి: టపాసులు విక్రయదారులు నిబంధనలు పాటించాలని తహసీల్దార్ ఆర్‌వీ సునితబాయి అన్నారు. మంగళవారం సాయంత్రం ఆమె సమావేశ ఏర్పాటు చేసి టపాసుల విక్రయదారులు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసే టపాసుల విక్రయషాపుల స్థలాన్ని పరిశీలించారు. సీఐ ఎం రాజశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డీ బీవీ శశికళ, ఈఓ పీ చంద్రశేఖర్ ఉన్నారు.

'మట్టి టిప్పర్లు ఊర్లో తిప్పొద్దు'

పుట్లూరు: మట్టి టిప్పర్లు ఊర్లో తిప్పొద్దంటూ మండల కేంద్రంలోని రోడ్డుపై మహిళలు మంగళవారం నిరసన చేపట్టారు. మండల కేంద్రాన్ని ఆనుకొని కొండల నుంచి మట్టిని తాడిపత్రిలో రోడ్డు వేయడానికి తరలిస్తున్నారని దీంతో దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. టిప్పర్లను గ్రామం బయట ఉన్న దారి నుంచి తిప్పాలన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ దిలీప్‌కుమార్ అక్కడికి చేరుకుని సర్దిచెప్పడంతో వారు శాంతించారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు స్పందన

గుత్తి: స్థానిక విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక లోక్‌అదాలత్‌కు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభించింది. ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనీకుమార్, స్వతంత్ర సభ్యురాలు ఈశ్వరమ్మ హాజరై, అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ ఈఈ రాజశేఖర్, ఏడీఈ సాయి, ఏఈ కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కసాపురం ఆలయ పాలక మండలి సభ్యుడి మృతి



త్యాగరాజు(ఫైల్)

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుడు మంతాజీ త్యాగరాజు(65) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. పోలీస్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా రిటైర్డ్ అయిన ఆయన వైఎస్సార్‌సీపీలో కీలకంగా పని చేశారు. ఆయన సేవలను గుర్తించిన ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా నియమించారు. త్యాగరాజు మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి త్యాగరాజు మృతిపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దవడుగూరు: ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

పామిడి: గుంతకల్లులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ సమావేశం జరగనుంది. ఓటరు జాబితాపై చర్చించనున్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పోలింగ్‌బూత్ ఏజెంట్లు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు కోరాయి.

నిందితుడికి రిమాండ్

గార్లదిన్నె: పోక్సో కేసులో నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ముకుందాపురానికి నారాయణ అనే వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం విదితమే. మంగళవారం పోలీసులు నిందితుడిని జిల్లా కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఏఎస్ఐ గురుమూర్తి తెలిపారు.

పంట నష్టపరిహారం అందించాలి

తాడిపత్రిటౌన్: ఖరీఫ్‌లో పంట సాగు చేసిన నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. తిమ్మాపురం ఎగువపల్లి, తేరన్నపల్లిలో మంగళవారం వారు ఎండిన పంటలను పరిశీలించారు. ఎకరాకు రూ.25 వేలు నష్టపరిహారం అందించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రంగయ్య, నాయకులు నారాయణరెడ్డి, సురేష్, ముస్తాఫా, సుధాకర్, రఫీ పాల్గొన్నారు.

రేపటి నుంచి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు

పామిడి: మండలంలో గురువారం నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలు జరగనున్నాయి. గురువారం అనుంపల్లి, 10న దేవరపల్లి, 14న జీ కొట్టాల, 15న రామగిరి, 16న ఎద్దులపల్లి, 17న సొరకాయలపేట, 20న వంకరాజుకాలువ, 21న పామిడి తలవాలకట్ట, 22న అంబేడ్కర్ కాలనీ, 23న గుప్తాకాలనీలో కార్యక్రమాలు జరుగుతాయి. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కార్యాలయవర్గాలు కోరాయి.

ఆరుగురిపై కేసు నమోదు

గార్లదిన్నె: స్థానిక డ్యాం రోడ్డు సమీపంలో సోమవారం రాత్రి జరిగిన దాడి కేసులో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ గురుమూర్తి తెలిపిన వివరాలు.. మంజునాథ్ అనే వ్యక్తి బిగ్ బాస్కెట్ కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్నాడు. అదే కంపెనీలో పని చేసే శివలింగయ్యను కంపెనీ ఉద్యోగం నుంచి తొలగించింది. ఇందుకు మంజునాథ్ కారణమని భావించిన శివలింగయ్య మరికొంతమందితో కలిసి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

శింగనమల: పోతురాజుకాల్వ సమీపంలో అనంతపురం-తాడిపత్రి హైవేపై కూతలేరు బ్రిడ్జి వద్ద ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్ఐ చితంబరం తెలిపిన వివరాలు.. అనంతపురం సాయినగర్‌కు చెందిన మనోహర్(39) కారు డ్రైవరుగా పని చేసేవాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. గతంలో రెండు ఆటోలు పెట్టి అప్పుల పాలయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. ఈక్రమంలో కూతలేరు బ్రిడ్జి దూలానికి ఉరేసుకున్నాడు. మనిషి బరువుకు తాడు తెగి కంపచెట్లలో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య నారాయణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

ఇసుక లారీ, ట్రాక్టర్ సీజ్

తాడిపత్రి అర్బన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీతో పాటు ఓ ట్రాక్టర్‌ను సెబ్, అర్బన్ పోలీసులు సీజ్ చేశారు. మంగళవారం సెబ్ అధికారి విజయ్‌కుమార్ రూరల్ పరిధిలోని బోగసముద్రం సమీపంలో ఇసుక లారీని సీజ్ చేసి డ్రైవర్ పెద్దగుర్రప్పను అరెస్ట్ చేశారు. లారీని కేసు నమోదు నిమిత్తం రూరల్ పోలీసులకు అప్పగించారు. తాడిపత్రిలోని హనుమాన్ జంక్షన్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్ వేణును అరెస్ట్ చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు అర్బన్ పోలీసులు తెలిపారు.